మినీ కథ

# ఇంక్రిమెంటల్ సమస్య

మానేపల్లి సత్యనారాయణ

గుర్నాధానికి గుడివాడ నుంచి టెలిగ్రాం వచ్చింది.

బ్లెస్డ్ విత్ టు డాటర్స్-ట్విన్స్.

ఒక్క నిముషం గుండె ఆగినంత పనయింది. కొండంత ఆశ పెట్టుకున్న గుర్నాధం గుండెల్లో ఎవరో గునపం దించి నట్టయింది.

తొలి కాన్పు కూతురు పుట్టింది. మలి కాన్పు కొడుకు పుడతాడన్నది అతని తిరుగులేని నమ్మకం. ఎమ్మెస్సీ ఫిజిక్స్ డిస్టింక్షన్‌తో పాసయిన గుర్నాధానికి జాతకాలన్నా, బాబాలన్నా వల్లమాలిన గురి, భక్తీని. అవధూతానంద స్వామివారి ఆశీస్సు అబద్ధమయిపోయిందా? అయ్యయ్యో! వారి ఆశ్రమానికి అయిదు వందల విరాళం కూడా చెల్లించేశాడే!

గుర్నాధం గుండె రాయి చేసుకున్నాడు. మొత్తం ముగ్గురాడపిల్లల తండ్రయినందుకు లోలోపల దుఃఖంగా వున్నా పైకి నిబ్బరంగా వుండేందుకు ప్రయత్నం చేస్తున్నాడు. ఆడపిల్లలపట్ల అటువంటి దృక్పథం చాలా తప్పని మిత్రుడు సత్యం చెబుతున్నాడు. అతను ఒకందుకు చెబితే గుర్నాధం మరొకందుకు సరిపెట్టుకున్నాడు.

ఒకనాటి శుభముహూర్తాన గుర్నాధం—బల్లెక్కాడు—అదే. ఆస్పత్రిలో ఆపరేషన్ బల్లెక్కాడు. అదితెలిసిన అతని భార్య ధనలక్ష్మి కంటికీ కడుపుకీ ఏకధారగా దుఃఖించింది. ఆస్పత్రినుంచి ఇవతలికి వచ్చిన తరువాత —సర్టిఫికెట్ జోడించి, తనకు రెండు ఇంక్రిమెంట్లు ఇవ్వవలసిందిగా ఆఫీసరు గారికి అప్లికేషన్ పెట్టుకున్నాడు.

నెల తరవాత అప్లికేషన్ పై ఆఫీసర్‌గారి 'క్వెరీ'తో అది కాస్తా తిరిగి వచ్చింది.

"ముగ్గురు పిల్లలు కనుక మీకు ఒకే ఇంక్రిమెంటు వస్తుంది. రెండు ఇంక్రిమెంట్లు రావు" అని రిమార్కు!

ముగ్గురు పిల్లలయినప్పటికీ రెండే వాయిదాలు గనుక, తనకు రెండు ఇంక్రిమెంట్లు ఇవ్వాలని గుర్నాధం వాదన. అతని అప్లికేషన్ క్లారిఫికేషన్ (స్పష్టీకరణ!!) నిమిత్తం మహారాజశ్రీ ప్రభుత్వం వారి దగ్గిరికి వెళ్ళింది. అది అక్కడ పడుకుంది.

రిమైండర్లు పంపగా పంపగా పంపగా పంపగా. మీ కాయితం అసలు మాకు చేరలేదనీ, మొదటినుంచి ఫైలు మొత్తం పంపవలసిందనీ సమాధానం వచ్చింది.

సరికొత్త రిమార్కులతో మొత్తం ఫైలు మళ్ళీ "పైకి" పంపించారు. కాన్పులు మాత్రమే లెక్క చూడవలసిందనీ, కవల పిల్లలు పుట్టినందుకు తన బాధ్యత ఎంతమాత్రం లేదనీ, న్యాయం ఆలోచించవలసిందనీ గుర్నాధం సవివరమైన, సరికొత్త అప్లికేషన్ కూడా పెట్టుకున్నాడు.

మళ్ళీ రిమైండర్లు పంపగా....పంపగా.... సమాధానం వచ్చింది- "ఈ సమస్య చురుకుగా పరిశీలించబడుతున్నది".

అదే శాఖలో పని చేస్తున్న అనంత సుబ్రహ్మణ్యానికి కంగారు బయలుదేరింది.

కాయితాలు కదలాలంటే ప్రయత్నాలు చెయ్యాలిగాని. సీళ్ళు కారిపోవడానికి ప్రయత్నాలు దేనికి?

ఏడాదిపాటు నాని నాని నాని గుర్నాధం సమస్య సీళ్ళుకారి పోయింది.

యువర్ రిక్వెస్ట్ మె నాట్ బి కంప్లయిడ్ విత్.

"మీ అభ్యర్థన అంగీకరింపబడజాలదు."

గుర్నాధం మనసులో నిరాశతో కృంగిపోయాడు. ముగ్గురు ఆడపిల్లల్ని ఆడించుకుంటూ ఆనందించడానికి ప్రయత్నిస్తున్నాడు.



అతని భార్యకు నాలుగు కాన్పులకూ- ఒకే కొడుకు దక్కాడు. సంతానాన్నిబట్టి ఇవ్వాలిగాని, కాన్పులిన్నిబట్టి ఇంక్రిమెంట్లు ఇస్తే కొంపలంటుకుపోవూ? అంచేత లోపాయికారీగా గుర్నాధం కాయితం సీళ్ళుకారిపోయే ప్రయత్నాలు ప్రారంభించాడు.

చాలా ఆలస్యంగా-ఒక ఫామిలీప్లానింగ్ ఇంక్రిమెంట్ మాత్రం శాంక్షనయింది.

* * *

అయిదేళ్ళ తరువాత గుర్నాధానికి — అవును గుర్నాధానికే- కొడుకు పుట్టాడు.